క్లుప్తంగా

గరుడవాహనంపై ఊరేగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ఉదయం ఆలయంలో నిత్య ఔపాసన, బలిహరణ, విశేష అర్చనలు, హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీ వాసుదేవ మహిళా కోలాట భజన మండలి నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు, ఆలయ కమిటీ సభ్యులు నూకల ప్రసాద్ పర్యవేక్షించారు.

ముగిసిన మహంకాళమ్మ జాతర




గూడూరు: ముక్కొలులో మహంకాళమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ప్రభ వాహనాలతో ఊరేగింపు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారికి మొక్కుబడులు సమర్పించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గూడూరు ఎస్ఐ వీర్రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ సమ్మెట వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కనులపండువగా కల్యాణం

యార్లగడ్డ(చల్లపల్లి): మండల పరిధిలోని యార్లగడ్డలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తల పర్యవేక్షణలో శనివారం రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవలయాల ఈఓ ఎన్ఎస్.చక్రధర రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఆదివారం సాయంత్రం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెడన: స్థానిక శ్రీపైడమ్మ అమ్మవారు ఆదివారం నిజరూప దర్శనంలో భక్తులకు కనిపించారు. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేలా దేవదాయశాఖ, ఆలయ వ్యవస్థాపకులు, పాలకవర్గ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచే అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

రచయిత మేరీ కృపాభాయ్‌కు అవార్డు



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంకు చెందిన రచయిత్రి జి. మేరీకృపాభాయ్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. గుంటూరుకు చెందిన డాక్టర్ రాజన్‌బాబు, డాక్టర్ స్వర్ణలత దేవి ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన 5వ వార్షికోత్సవంలో ఈ అవార్డును ఆమెకు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు పొందిన మేరీ కృపాభాయ్‌ను పలువురు కవులు, నగర ప్రముఖులు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



గూడూరు: ఉప్పాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముక్కొలు గ్రామంలో చలివేంద్రాన్ని సర్పంచి సమ్మెట జయవర్ధన్ ఎంపీటీసీ సభ్యుడు వై శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉప్పాల ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి రోజూ కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

తాగునీటిని పొదుపుగా వినియోగించాలి

నగర కమిషనర్ బాపిరాజు



మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు చిత్రంలో ఎంఈ సాంబశివరావు, ఏఈ

మచిలీపట్నంటౌన్: సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటి నిల్వలు తక్కువ ఉన్నందున నగర ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం తన చాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తరకటూరులోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో 5.19 మీటర్ల మేర నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా 3.35 మీటర్ల మేర ఉందన్నారు. 2100 మిలియన్ లీటర్ల మేర నీరు ఉందన్నారు. నగరంలోని పుట్లమ్మచెరువులో 560 మిలియన్ లీటర్ల నీరు ఉండాల్సి ఉండగా 210 మిలియన్ లీటర్ల నీరు ఉందన్నారు. మొత్తం 2310 మిలియన్ లీటర్ల నీరు సరఫరాకు ఉందన్నారు. అయితే ఈ నీరు రానున్న 30 రోజులకు సరిపోతాయని అందువల్ల ప్రస్తుతం రోజు విడిచి రోజు ఇస్తున్న సరఫరాను సోమవారం తరువాత రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తామన్నారు. తాగునీటిని తాగడానికి, వంటకు మాత్రమే వినియోగించాలన్నారు. ఏప్రిల్ 10వ తేదీన కాలువల ద్వారా నీరు విడుదలైతే చెరువులను నింపుతామని దీంతో రోజు విడిచి రోజు యథాతథంగా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చేతిపంపులను వినియోగించేందుకు సంసిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. నగరంలోని ఉన్న పలు పబ్లిక్ బోరింగ్ పంపులకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఈ పంపుల ద్వారా వాడుక నీటిని ప్రజలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆల్‌మట్టి డ్యామ్‌లో కూడా నీటి నిల్వలు లేకపోవటంతో బెంగళూరులో ఇటీవల కొద్ది రోజుల నుంచి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను వర్క్ ఫ్రం హోం చేయమని ఆదేశాలు ఇచ్చారన్నారు. నగరంలో తాగునీటి సమస్యలు ఎదురైతే 08672–227700, 98499 07989 నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఇంజినీర్ సాంబశివరావు, ఏఈ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి



డాక్టర్ చంద్రశేఖరరావును సన్మానిస్తున్న సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, నాయకులు

శ్రీకాకుళం(ఘంటసాల): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయం చేకూరడంతో పాటు ఎంపీ అభ్యర్థిగా తను కూడా గెలవాలని శ్రీకాకుళేశ్వర స్వామి వారిని కోరుకున్నట్లు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో వేంచేసి యున్న శ్రీకాకుళేశ్వర స్వామి వారిని డాక్టర్ చంద్రశేఖరరావు, యువనేత సింహాద్రి రామ్‌చరణ్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కృష్ణా కరకట్ట దిగువన ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళేశ్వర స్వామి వారి ఆలయం ప్రాంగణంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావును తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీకాకుళం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ దివంగత నేత సింహాద్రి శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సింహాద్రి నాగబాబు సతీమణి నాగమణిని, కొండవీటి కృష్ణమూర్తి కుమారుడిని చంద్రశేఖరరావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, కొండవీటి వెంకటేశ్వరరావు, నేతలు తిరుమలశెట్టి సీతారాంబాబు, కొల్లిపర అర్జునరావు, తిరుమలశెట్టి బాబు, సిద్దే భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే ధ్యేయం



చల్లపల్లి: టీబీ రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుమ చౌదరి తెలిపారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ధూమపానం వీడితేనే క్షయ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన క్షయ వ్యాధిగ్రస్తులకు పోష్టికాహారం కోసం నెలకు రూ.500లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడికి ఎమ్మెల్యే నివాళి



భౌతిక కాయాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలుకు చెందిన గౌరం శివప్రసాద్(26) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్ గ్రామానికి వెళ్లి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు తనయుడు రామ్ చరణ్ కూడా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద కారణాలను తెలుసుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, సింహాద్రి వెంకటేశ్వరావు, అవనిగడ్డ జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, ఆకుల వెంకట్రామయ్య, మోటుపల్లి రెడ్డమ్మ, యల్లమల్లి రాజశేఖర్, రవికాంత్ యాదవ్ ఉన్నారు.

స్వామివార్లకు ధాన్యాభిషేకం



టేకుపల్లి(మోపిదేవి): శ్రీ కాంచి కామకోటి పీఠస్థ శ్రీ బాలా పార్వతీ సమేత శ్రీ రామేవ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు నవధాన్యాలతో ధాన్యాభిషేకం నిర్వహించారు. టేకుపల్లి గ్రామంలోని శ్రీ రామేశ్వరస్వామివారికి ప్రకృతి వైపరీత్యాలు జరుగకండా మంచి పంటలు పండాలని, గిట్టు బాటు ధరలు కల్పించాలని రైతులు అందించిన ధాన్యంతో ఆదివారం ధాన్యాభిషేకం చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నేతకు పితృవియోగం

మేకావారిపాలెం(చల్లపల్లి): చల్లపల్లి మండలం పాగోలు శివారు మేకావారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ నాయకులు రాజులపాటి శివప్రసాద్‌కు పితృ వియోగం కలిగింది. శివప్రసాద్ తండ్రి, చల్లపల్లి మండల జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి మామ అయిన రాజులపాటి నాంచారయ్య (80) ఆదివారం మధ్యాహ్నం తన స్వగృహంలో మృతి చెందారు. నాంచారయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

సంపటాలమ్మ తల్లి గ్రామ సంచారం ప్రారంభం



అమ్మవారి గ్రామ సంచారం ప్రారంభిస్తున్న పూజారులు

చల్లపల్లి: చల్లపల్లి గ్రామదేవత శ్రీ సంపటాలమ్మ అమ్మవారి గ్రామ సంచారం ఆదివారం ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారికి పూజారులు చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేసి గ్రామ సంచారం ప్రారంభించారు. చల్లపల్లి నరేష్ అమ్మవారి ఘటం బిందెను శిరస్సుపై ధరించి గ్రామ సంచారానికి బయలుదేరగా, గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారికి అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా అమ్మవారు స్థానిక పడమరవైపున ఉన్న పుట్టినింటి వారు ప్రతిపాటి వారి ఇంటికి వెళ్లి పసుపు కుంకుమలు స్వీకరించి అమ్మవారు గ్రామంలో సంచరించారు. చల్లపల్లి మునసబు గొర్రెపాటి పిచ్చేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, కమిటీ పెద్దలు లంక కొండలు, విన్నకోట శంకర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోలాహలంగా నెల సంబరం



నెల సంబరం పూజలు చేసిన కమిటి ప్రతినిధులు

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సర్కిల్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా నెల సంబరం ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజుకు మొక్కుబడులు చెల్లించు కునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో నెల సంబరం సంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు ప్రత్యేకపూజలు జరిపి, చద్దినైవేద్యాలు స్వీకరించారు. అనంతరం భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. డప్పు నృత్యాలు, మేళతాళాలతో, నైవేద్యాల కావళ్లతో భక్తులు బంధు మిత్రులతో కలసి భారీగా తరలివచ్చారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్ (బుజ్జి) దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. తలశిల బాలకృష్ణ, బోయపాటి రాము, గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు



సంగమూడిలో విగ్రహాల ఊరేగింపులో భక్తులు

కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందురోజు స్వామివారి విగ్రహాలను కొమాళ్లపూడి, నీలిపూడి, మునిపెడ, యండపల్లి, గాంధీనగరం గ్రామాలలో ఘనంగ ఊరేగించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ నెల 27వ తేదీన ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



రామచంద్రరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప్పాల రాము

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలంలో రాజకీయ పరిణామాలు రోజురోజుకు మారుతున్నాయి. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అనుచరుడిగా ఎప్పటి నుంచో రాజకీయాల్లో ఉన్న బస్వాని రామచంద్రరావు (ఎంఆర్‌వో) శనివారం వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మండల పరిధిలోని పల్లెపాలెం పంచాయతీ పెన్నమ్మదిబ్బ గ్రామానికి చెందిన ఆయన నీలిపూడిలో జరిగిన ప్రజాదీవెన కార్యక్రమం సందర్భంగా పార్టీలో చేరారు. ఆయనకు రాము పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వినర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బాపూజీ, పట్టపు నానిలు ఉన్నారు.



మచిలీపట్నంలో ర్యాలీలో పాల్గొన్న పేర్ని కిట్టు, నేతలు



ఎల్ఈఎఫ్ చర్చిలో ఇతివృత్తాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఎల్ఈఎఫ్ చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



ఎల్ఈఎఫ్ చర్చిలో మట్టలు, కొమ్మలతో చిన్నారులు



పెడనలో ఫ్లాగ్ శిలువలతో చర్చిలోకి వెళ్తున్న క్రైస్తవులు



పెడనలో ఆర్సీఎం చర్చిలో ప్రార్థలు చేస్తున్న విశ్వాసులు

ఆనందోత్సాహాలతో మట్టల ఆదివారం

నగరంలోని క్రైస్తవులు పువ్వులతో అలంకరించిన ఈతమట్టలను చేపట్టి ఏసు క్రీస్తును స్మరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఏసుక్రీస్తు యెరూషలేంలో జయోత్సాహంతో ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగగా నిర్వహించారు. పలు చర్చిల పరిధిలో నాటికలు, నృత్యాలు ప్రదర్శించారు. నగరంలోని పలు చర్చిల వద్ద జరిగిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలతో అలంకరించిన మట్టను చేబూని పాల్గొన్నారు. పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

–మచిలీపట్నంటౌన్, పెడన, అవనిగడ్డ



సీతనపల్లిలో మట్టల ఆదివారపు వేడుకల్లో విశ్వాసులు



ఘంటసాలలో గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



అవనిగడ్డలో సందేశం ఇస్తున్న ఫాదర్ సురేష్

ఆధ్యాత్మిక చింతన ఉండాలి



పెనుమాలగూడెం సహాయమాత మందిరంలో ఉప్పాల రాము

బంటుమిల్లి: నిత్యసహాయమాత గృహప్రతిష్టా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) పెదతుమ్మిడి పంచాయతీ పెనుమాలగూడెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆధ్యాత్మికత చింతన ఉండాలన్నారు. మంచి మార్గంలో మన జీవన ప్రయాణం కొనసాగాలని కోరారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి దేవాయలంలో భక్తుల కోలాహలం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.